

జీరో కరెంటు బిల్లు కోసం దరఖాస్తు చేసుకోవాలి

మర్పల్లి, ఆగస్టు 12: తెల్లరేషన్ కార్డు ఉండి జీరో విద్యుత్ బిల్లులు రాని వినియోగదారులు నేరుగా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజమల్లయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు జీరో బిల్లు రాని వారు ఉంటే తెల్లరేషన్ కార్డు, కరెంట్ బిల్లు, ఆధార్ కార్డు, ఆరు గ్యారంటీలకు సంబంధించిన రశీదుతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



ధారూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల బారులు

యూరియా.. ఏదయా!

ఎరువులు దొరక్క రైతుల ఇక్కట్లు

పంటల సాగుకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచాం.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.. అంటూ సభలు, సమావేశాల్లో పాలకులు, అధికారులు ఊదరగొడుతున్నా... వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో ఎరువుల కొరతతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదే అదనుగా ఎరువుల వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. డీఏపీ కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని మెలిక పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ-పాస్ విధానంలో సిగ్నల్స్ రావడం లేదనే సాకుతో యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అక్రమ వ్యాపారానికి తెరలేపారు.

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- మార్కెట్లో అధిక ధరలకు విక్రయాలు
- డీఏపీ కొంటేనే యూరియా అంటూ మెలిక
- కొరత పేరుతో కర్ణాటక రాష్ట్రానికి తరలింపు
- వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ కరువు



రైతుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్న ఏవో రజిత

తాండూరు రూరల్/ధారూరు, ఆగస్టు 12: వ్యవసాయాధికారుల పర్యవేక్షణ లోపంతో ఫర్టిలైజర్ దుకాణం యజమానులు యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రైతులకు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ-పాస్ విధానంలో సిగ్నల్స్ రావడం లేదనే సాకుతో ఫర్టిలైజర్ షాపు యజమాని యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అక్రమ వ్యాపారానికి తెరలేపారు. తాండూరు ప్రాంతంలోని రైతులకు విక్రయించాల్సిన యూరియాను నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటక రాష్ట్రంలోని రైతులకు విక్రయిస్తున్నారు. దీంతో కొంత మంది రైతులు ఫర్టిలైజర్ దుకాణం వద్దకు వచ్చి యజమానిని నిలదీశారు. తాండూరు మండలం మిట్టబాస్పల్లి గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ పి.నరేందర్‌రెడ్డి యూరియా కోసం రాగా, ఆ ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి రెండు బస్తాల 20-20 కాంప్లెక్స్ ఎరువు కొంటేనే మూడు బస్తాల యూరియా ఇస్తానన్నారు. దీంతో ఆయన మూడు బస్తాలకు సంబంధించిన రూ.960లను ఫర్టిలైజర్ షాపు నిర్వహకుడి ఫోన్‌లో ఆన్‌లైన్‌ద్వారా డబ్బు జమ చేశారు. అసలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్క యూరియా బస్తా రూ.265లకు విక్రయించాల్సి ఉంది. దీంతో ఎక్కువ డబ్బులు ఎందుకు తీసుకుంటున్నావని దుకాణం నిర్వహకులతో వాదనకు దిగారు. దీంతో తాండూరు వ్యవసాయశాఖ ఏడీ రుద్రమూర్తి, ఏవో రజితలకు ఫిర్యాదు చేశారు. ఏడీ రుద్రమూర్తి ఆదేశాల మేరకు ఏవో రజిత ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు ఈ-పాస్ విధానం అమలు చేస్తున్నారా అనే విషయంపై ఆరా తీశారు. ఈ-పాస్ విధానం పనిచేయడం లేదని, ఆధార్ కార్డు తీసుకోకుండానే ఎందుకు విక్రయిస్తున్నావని దుకాణం నిర్వహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న మరికొందరు యూరియా కోసం వచ్చిన రైతులు ఒకబస్తా రూ.320ల వరకు విక్రయిస్తున్నారని దుకాణం నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దుకాణంలో ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. 21 రోజులపాటు విక్రయాలు జరుపరాదని శ్రీధనలక్ష్మీ సీడ్స్‌పెస్టిసైడ్ షాపు యజమానికి స్టాప్‌సేల్ నోటీసు జారీ చేశారు. అధికారుల అనుమతి లేకుండా యూరియా విక్రయించొద్దని ఆదేశించారు.

ఏవోతో రైతుల మొర

తాండూరు ప్రాంతంలో యూరియా కొరత అధికంగా ఉందని పలు గ్రామాల రైతులతో పాటు చెంగోల్‌కు చెందిన అంజమ్మ ఏవో రజితతో మొరపెట్టుకున్నారు. తాండూరులో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలు తిరిగినా యూరియా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని కొందరు రైతులు ఆరోపించారు. యూరియా కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించడంపై జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కొంత మంది ఫర్టిలైజర్ వ్యాపారులు యూరియా కొరత చూపిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు.





తాండూరురూరల్: గౌతాపూర్‌శివారులోని షాపు నుంచి కర్ణాటక వాహనంలో యూరియా, డీఏపీ బ్యాగుల తరలింపు

సన్న యూరియా కోసం బారులు

ప్రస్తుతం రైతులు వరి నాట్లకు, పత్తి, మొక్కజొన్నకు సన్న యూరియానే వాడుతున్నారు. దీంతో దానికి డిమాండు పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా కాకపోవటంతో రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. వారం రోజులుగా వికారాబాద్ జిల్లా ధారూరు పీఏసీఎస్‌కు సన్న యూరియా సరఫరా కాలేదు. సోమవారం 1,060 సంచుల సన్న యూరియా రావటంతో రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. యూరియా సంచులు దొరుకుతాయో లేదోననే ఆందోళనతో రైతులు ఒక్కసారిగా తరలిరావడంతో రావడంతో తోపులాట జరిగింది. దీంతో పోలీసుల సాయంతో సంఘం సిబ్బంది యూరియాను పంపిణీ చేశారు. సాయంత్రం వరకు ఒక్కో రైతుకు మూడు యూరియా సంచుల చొప్పున పంపిణీ చేశారు.

సన్న యూరియానే రైతులు కావాలంటున్నారు

యూరియా కొరత లేదని, సన్న యూరియానే కావాలని రైతులు కోరుతున్నారు. సొసైటీకి సోమవారం1,060 బస్తాల సన్న యూరియా వచ్చింది. యూరియా దొరుకుతుందోలేదోనని రైతులు లైన్లో ఒకరినొకరు తోసుకోవడంతో సమస్య ఏర్పడింది. మంగళవారం మరో రెండు లారీల సన్న యూరియా వస్తుందని, రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దు. అందరికీ పంపిణీ చేస్తాం.

\- సీఈవో నర్సింహులు, ధారూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/మేడ్చల్ ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో 150 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి, భూసర్వే, ఆసరా పింఛన్లకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని తెలిపారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 73 ఫిర్యాదులు

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 73 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియలు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.


అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం జిల్లా సమాఖ్య భవనంలో అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను దుర్వినియోగం కాకుండా పిల్లలకు ఉపయోగ పడేవిధంగా పనులు చేయించాలని ఆదేశించారు. మండలం వారీగా మండలసమాఖ్య సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్కూల్ డ్రెస్‌లను నాణ్యతగా తయారు చేసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్కూల్స్‌కు అందజేయాల్సిన లైట్స్‌ను, ఫ్యాన్‌లను పరిశీలించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీఓ సరోజ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, తదితరులు పాల్గొన్నారు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

పట్టుతప్పితే ప్రమాదమే..



మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం కొడంగల్ మండలంలోని మైసమ్మకుంట తండాకు బస్సు లేకపోవడంతో ఆటోలో విద్యార్థులు ప్రమాదపు అంచున నిలబడి వెళ్తున్నారు. పట్టు తప్పితే పరిస్థితి ఏంటని ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

\- కొడంగల్ రూరల్, ఆగస్టు 12

కేజీబీవీలో పాము కలకలం



కులకచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పాము కలకలం రేపింది. సోమవారం పాఠశాలలో పాము ప్రత్యక్షమవడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. గమనించిన పాఠశాల సిబ్బంది పాములు పట్టే అజాంకు సమాచారం ఇచ్చారు. అతను అక్కడికి చేరుకొని పాఠశాల ఆవరణలోని రాళ్లలో ఉన్న పామును పట్టుకొని అటవీ ప్రాంతానికి తరలించాడు. దీంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

కులకచర్ల, ఆగస్టు 12

ల్యాండ్ పూలింగ్‌కు శ్రీకారం

సేకరించిన భూమిలో రోడ్డు వేసిన అధికారులు



ప్రతాప్‌సింగారంలో ఉప్పల్ భగాయత్ తరహాలో భారీ వెంచర్

- 130ఎకరాలకు గాను 115 ఎకరాలు సేకరించిన హెచ్‌ఎండీఏ అధికారులు
- ఎకరాకు రైతుకు 1,743 గజాల స్థలం ఇవ్వనున్న అధికారులు
- స్వచ్ఛందంగా భూమిని అప్పగించి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసిన రైతులు
- వెంచర్ సక్సెస్ అయితే ప్రభుత్వానికి భారీ ఆదాయం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12 : మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ప్రతాప్‌సింగారంలో భారీ వెంచర్ చేయడానికి హెచ్‌ఎండీఏ అధికారులు శరవేగంగా ల్యాండ్‌పూలింగ్ పనులు చేపట్టారు. ఉప్పల్ భగయాత్ తరహాలో వెంచర్ చేసేందుకు ల్యాండ్ పూలింగ్‌కు శ్రీకారం చుట్టారు. మూసినదికి ఇరువైపుల అవుటర్ రింగ్‌రోడ్డు వరకు ల్యాండ్ పూలింగ్ చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మొదటి దశలో భాగంగా ప్రతాప్‌సింగారంలో 130 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో వెంచర్ చేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 115 ఎకరాల భూమిని 140 మంది రైతుల నుంచి భూసేకర చేపట్టిన అధికారులు రైతులతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేయించారు. అధికారుల సూచనల మేరకు రైతులు స్వచ్చందంగా భూములు ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఎకరం భూమికి బదులుగా రైతులకు 1,743 గజాల స్థలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఇస్తారు. మిగతా భూమిలో రోడ్లు, పార్కులు, మౌలికవసతులకు పోగా హెచ్‌ఎండీఏ పేరిట 1,157 గజాల స్థలం ఉంటుంది. దీంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరనుంది. ఉప్పల్ భగాయత్ తరహాలో అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పడంతో రైతులు ఆసక్తి చూపి తమ భూములను అప్పగించారు. మిగతా 17 మందికి చెందిన మరో 15 ఎకరాల భూమిని త్వరలో సేకరించి పనుల్లో వేగంపెంచనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 15 ఎకరాల భూమిలో ఎక్కువగా వారసత్వ మార్పిడి, ఎన్ఆర్ఐలకు సంబంధించినది కాగా కొంతభూమి పీఓబీ(ప్రోహిబిటేడ్ అర్డర్‌బుక్)జాబితాలో ఉండటంతో కొంత అలస్యమవుతుందన్నారు. సేకరించిన 115 ఎకరాల భూమిలో ఇప్పటికే 90 ఎకరాల భూమిని నాలా మార్పిడి సైతం చేశారు. భూమిని చదును చేసి రోడ్ల నిర్మాణం చేపట్టారు. రైతులకు ఇవ్వగా ప్రభుత్వం వద్ద ఉన్న 40 శాతం భూమిలో సామాన్యులకు అందుబాటులో ఉండేవిధంగా 150, 200, 300, 400, 500 గజాలుగా ప్లాటింగ్ చేయాలని, మరో పక్క ఐటీ, వర్క్‌స్టేషన్లకు ఇవ్వాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో స్థానికులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.



సేకరించిన ల్యాండ్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు

రెండున్నర ఎకరాల భూమిని ఇచ్చా

రెండున్నర ఎకరాల భూమిని హెచ్ఎండీఏకు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేశాను. ఉప్పల్ భగాయత్‌లో వెంచర్ చూసిన తరువాతే భూమిని ఇవ్వడానికి ముందుకు వచ్చాం. అధికారుల సూచనల మేరకు భూమిని అప్పగించాం. పనులు త్వరగా చేపట్టి నిబంధనల ప్రకారం మాకు రావాల్సిన భూమిని ఇస్తే బాగుంటుంది.

\- పంకర్ల అంజయ్యయాదవ్, ప్రతాప్‌సింగారం

ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది

ఉప్పల్ భగాయత్ తరహాలో ఇక్కడి హెచ్‌ఎండీఏ వెంచర్ నిర్మాణం చేస్తే మూసినది పరివాహక ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మిగతా భూములకు విలువ పెరుగుతుంది. ల్యాండ్‌పూలింగ్‌తో సన్నకారు, చిన్నకారుల రైతులకు ఎంతగానో మేలు జరుగుతుంది.

\- మలిపెద్ది సుభాష్‌రెడ్డి, ప్రతాప్‌సింగారం

మిగతా భూమిని త్వరలో సేకరిస్తాం

ప్రతాప్‌సింగారంలో 130 ఎకరాలకు గాను 115 ఎకరాల భూమిని సేకరించి రైతులతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేశాము. మిగతా 15 ఎకరాల భూమికి సంబంధించి చిన్నచిన్న సమస్యలున్నాయి. వాటిని అధిగమించి త్వరలో సేకరిస్తాం. పనులు ముమ్మరం చేసి అనుకున్న ప్రకారం రైతులకు భూమిని కేటాయిస్తాం

\- శైలజ, తహసీల్దారు, ల్యాండ్‌పూలింగ్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

బషీరాబాద్, ఆగస్టు 12: ఉపాధ్యాయుల పరిష్కారానికి పీఆర్టీయూ నిర్విరామంగా కృషి చేస్తుందని జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. పీఆర్టీయూ బషీరాబాద్ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ టీచర్ల సమస్యల్లో ఒకటైనా 317జీవో బాధితులకు తగు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వారికి హెల్త్ కార్డులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. పీఆర్టీయూ బషీరాబాద్ మండలశాఖ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన నాలుగు డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించేలా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై వత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి, రవికాంత్, సంతోష్, ఈశ్వర్‌గౌడ్, నాగరాజ్, సాజిదాబేగం, శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, మౌలానా పాల్గొన్నారు.



బషీరాబాద్ సీపీఎస్‌లో సభ్యత్వం చేయిస్తున్న వెంకట్‌రాంరెడ్డి, తదితరులు

అయ్యో బిడ్డా.. ఎంతపని జరిగింది

- అశ్రునయానాల మధ్య తండ్రి, ఇద్దరు కూతుళ్ల అంత్యక్రియలు
- ఒకే సమాధిలో.. ముగ్గురి మృతదేహాలు

మనోహరాబాద్, ఆగస్టు 12: 'అయ్యో బిడ్డా ఎంత పని జరిగింది. ఒక్క ప్రమాదంలోనే కుటుంబం ఆగమైంది కదా.. తండ్రి ఇద్దరు బిడ్డలకు ఒకే రోజు రాసిపెట్టాడా' ఆ దేవుడు అంటూ అక్కడున్న వారంతా కన్నీరు మున్నీరయ్యారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాక్‌మెన్ కృష్ణ(42), అతని ఇద్దరు కూతుళ్లు వర్షిత (12), వరణి(7)లు ఆదివారం మేడ్చల్ జిల్లా గౌడవెల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీ కొని చనిపోయిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను సోమవారం స్వగ్రామమైన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు తీసుకురాగా గ్రామస్థుల ఆశ్రునయనాల మధ్య జరిగాయి. గ్రామానికి చెందిన నారాయణ, నాగమణిల చిన్నకుమారుడైన కృష్ణకు రైల్వేలో పని చేసిన తండ్రి ఉద్యోగ విరమణ చేయడంతో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ నిమిత్తం కృష్ణ పదేళ్లుగా మేడ్చల్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఈ ఘోరం జరగగా, సోమవారం గ్రామస్థుల ఆశ్రునయనాల మధ్య తండ్రీ కూతుళ్ల అంత్యక్రియలు జరిగాయి. ఒకే బొంద తీసి తండ్రి, ఇద్దరు కూతుళ్లను ఖననం చేశారు. అయితే, తండ్రి, ఇద్దరు కూతుళ్లు ఒకే ప్రమాదంలో జరగడంతో తల్లి నాగమణి కుమారుడు, మనమరాళ్ల మృతదేహాల వద్ద పడి రోదించడం అక్కడి వారిని కదలించింది. బాధిత కుటుంబాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు.



కుమారుడు, మనుమరాళ్ల మృతదేహాల వద్ద రోదిస్తున్న కృష్ణ తల్లి నాగమణి

ఓటరు నమోదుకు మరో అవకాశం



మేడ్చల్ ఆగస్టు12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో కొత్త ఓటర్ల నమోదుకు మళ్లీ అవకాశం వచ్చింది. చిరునామా మార్పులు, సవరణలు, మృతుల పేర్లు తొలగించడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించుకోవడానికి అర్హులని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 20వ తేదీ నుండి బూత్‌స్థాయి అధికారులు ఇంటింటా తిరిగి వివరాలు సేకరించనున్నారు. అర్హత కలిగిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయించడంతో పాటు మృతుల వివరాలను తీసుకొని వారి పేర్లను జాబితా నుంచి తొలగించనున్నారు. అవసరమైన వారి చిరునామా మార్చనున్నారు. ఓటరు జాబితాలో ఫొటో లేకుంటే వాటిని సేకరిస్తారు. ఫొటో సరిగ్గి లేకుంటే మరొకటి తీసుకుని జాబితాలో చేరుస్తారు. యువతీ యువకులు బూత్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులను పూరించి ఇస్తే ఓటరుగా నమోదు చేస్తారని, అదేవిధంగా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవడానికి వీలుందని అధికారులు చెబుతున్నారు.

దశాబ్ద కాలపు ఎదురు చూపులకు మోక్షం

లక్నాపూర్ ప్రాజెక్టు కాల్వల మరమ్మతులు



లక్నాపూర్ ప్రాజెక్టు కాల్వలో తొలగించిన పూడిక

ధారూరు, ఆగస్టు 12: దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న రైతుల ఆశలు ఎట్టకేలకు ఫలించాయి. లక్నాపూర్ ప్రాజెక్టు కింద కాల్వలను సాగునీటి శాఖ అధికారులు మరమ్మత్తులు చేయించ కుండా వదిలేయటంతో కాలువలు అనవాళ్లు లేకుండా పోయాయి. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న మండల పరిధిలోని అంతారం, నాగారం, మోమిన్‌కలాన్, మోమిన్‌కుర్థు, రాజాపూర్ గ్రామాల రైతుల ఆయకట్టుకు సాగునీరు అందలేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు ఈ సమస్యను గత నెలలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసికెళ్లారు. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇరిగేషన్ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, చేవెళ్ల సర్కిల్ ఎస్‌ఈ రంగారెడ్డిలతో చర్చించి లక్నాపూర్ ప్రాజెక్టు కాల్వలను మరమ్మత్తులకు రూ. 18.44 లక్షలు మంజూరు చేయించటంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ప్రాజెక్టు కుడికాల్వలో మట్టితీత, చెట్లు, పొదల నరికివేత పనులు కొనసాగుతున్నాయి. కాల్వల మరమ్మత్తుల పనులతో తమ ఆయకట్టుకు సాగు నీరందుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శరవేగంగా పట్టణాల అభివృద్ధి



తొండుపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 11 : పట్టణాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గొల్లపల్లి, కిషన్‌గూడ్, తొండుపల్లి వార్డుల్లో కౌన్సిలర్లు లావణ్యశ్రీనివాస్‌గౌడ్, అశోక్‌తోలి కలిసి సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పట్టణాల అభివృద్ధికి శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక నిధులను పట్టణ ప్రాంతాలకు కేటాయించిందన్నారు. శంషాబాద్ పరిధి అన్ని వార్డులకు నిధులు కేటాయిస్తామన్నారు. ఇప్పటికే పట్టణంలో 90శాతం సీసీ రోడ్లు పూర్తిచేశామన్నారు. మిగిలినవీ పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుష్మారెడ్డి, వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, దర్శన్, శంకర్, రాచమల్ల సురేష్, మహేష్, విశ్వనాథం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చందాల కనువిందు



పల్లె దారులు పచ్చందాలను సంతరించుకున్నాయి. హరితహారంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఆరేళ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా దర్శనమిస్తున్నాయి. ఈ దారిలో ఇరువైపులా చెట్లు పచ్చందాలతో కనువిందు చేస్తూ రాకపోకలు సాగించే వాహనదారులకు పచ్చని తోరణం కట్టినట్లుగా స్వాగతం పలుకుతూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డులో గొట్టిగఖుర్దు సమీపంలోని చెట్లు పచ్చదనంతో ఇలా అందిరినీ ఆకట్టుకుంటున్నాయి. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలకు ఈ చెట్లు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. *- బషీరాబాద్, ఆగస్టు 12*

విరామం లేకుండా విధుల్లోనే

- రిలీవర్ వచ్చే వరకూ రోజుల తరబడి డ్యూటీ!
- కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో వింత పరిస్థితి
- సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్న ట్రాన్స్‌కో ఉద్యోగులు
- ఇక్కడ డ్యూటీకి జంకుతున్న సిబ్బంది





పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్, విధులు నిర్వహిస్తున్న జేఎల్‌ఎం

కేశంపేట, ఆగస్టు 12: సాధారణంగా ఓ ఉద్యోగి 8గంటలు పనిచేస్తాడు. అదనపు సమయం చేయాల్సి వస్తే మరో నాలుగు గంటలు పనిచేస్తాడు. అయితే కేశంపేట మండలం పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో డ్యూటీ పడితే రిలీవర్ వచ్చేంత వరకు ఉద్యోగి అక్కడే పనిచేయాల్సిందే! పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి 33/11కేవీఏ సబ్‌స్టేషన్‌ను అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రారంభించింది. సబ్‌స్టేషన్‌లో సిబ్బంది లేక ప్రారంభించిన కొద్ది రోజులకే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా బంద్రైంది. ఈ విషయమై అప్పట్లో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు కేశంపేట ఏఈ పరిధి సిబ్బందికి డ్యూటీవేసి సబ్‌స్టేషన్ నడిపించేలా చర్యలు తీసుకున్నారు. ఏఈ ఈశ్వర్ తన పరిధిలో ఉన్న లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, జేఎల్‌ఎంలు, ఆర్టిజెన్‌లతో రోజుకు ఒకరు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రతీ నెల 1న డ్యూటీచార్ట్ వేస్తున్నారు. అయితే రెండు నెలలుగా డ్యూటీచార్ట్ అమలు కావడం లేదు. 13మంది జూనియర్ లైన్‌మెన్ సబ్‌స్టేషన్‌ను నడిపిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహించాలంటూ జేఎల్‌ఎంలు జంకుతున్నారు. ఒకసారి డ్యూటీకి వెళ్తే.. మళ్లా రిలీవర్ వచ్చేంత వరకు డ్యూటీ చేయాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులగా రాజశేఖర్ అనే జేఎల్‌ఎం ఇక్కడ డ్యూటీ చేస్తున్నాడు. అతడికి రిలీవర్ రాక సోమవారం కూడా పనిచేశాడు. నాలుగు రోజలుగా అక్కడే ఉంటూ పక్క ఊరి నుంచి తినుబండారాలను తెప్పించుకొని తింటున్నాని చెప్పాడు. ఇంటికి పోయివచ్చే టైం కూడా లేదని, సబ్‌స్టేషన్‌లో డ్యూటీ అంటే రాత్రీ పగలు పర్యవేక్షణ ఉండాల్సిందే అని జేఎల్‌ఎం తెలిపాడు. ఏకధాటిగా నాలుగు రోజులు పనిచేస్తే పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశాడు. సబ్‌స్టేషన్‌కు సిబ్బందిని నియమించకుండగానే ప్రారంభించడంతో ఈ సమస్య ఎదురైనట్టు అర్టిజన్లు, జేఎల్‌ఎంలు అంటున్నారు. రెండు, మూడు రోజులు పనిచేయాలంటే ఇబ్బంది పడుతున్నామని వారు తెలిపారు.

రోజుకొకరితో సబ్‌స్టేషన్‌ను నడుపుతున్నాం

పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌కు సిబ్బంది లేక మండల పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిలో రోజుకు ఒక్కరికి ఇక్కడ డ్యూటీ వేస్తున్నాం. 30 మందితో సబ్‌స్టేషన్ రన్‌చేస్తున్నాం. సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. సిబ్బంది సహకారంతో వినియోగదారులకు సేవలందిస్తున్నాం. ఒక్కోసారి ఉద్యోగికి రెండు మూడూ రోజుల కంటిన్యూ డ్యూటీపడి ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ప్రభుత్వం పూర్తిస్థాయి సిబ్బందిని నియమిస్తే ఇబ్బదులు తీరుతాయి. **- ఈశ్వర్, ట్రాన్స్‌కో ఏఈ, కేశంపేట**

విశ్వకర్మల గొప్పతనాన్ని చాటాలి

పీఠాధిపతి సామర్ల వెంకటేశ్వరరావు



సామర్ల వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

షాద్‌నగర్‌అర్బన్, ఆగస్టు 12: విశ్వకర్మ జాతి గొప్పదని, తమ జాతి గొప్పతనాన్ని సమాజానికి చాటాలని హైదరాబాద్ ధర్మ సంవర్ధిని కాలజ్ఞాన పీఠాధిపతి సామర్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. విశ్వకర్మ ఫౌండేషన్, విశ్వబ్రాహ్మణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పతంజలి యోగా కేంద్రంలో విశ్వబ్రాహణ ఆత్మీయ సమ్మేళనం, వివాహ పరిచయ వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద విశ్వకర్మలు సైతం ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేలా ప్రోత్సహించాలని కోరారు. పవిత్రమైన వివాహ ఆచార వ్యవహారాలను కాపాడడానికి వేదికలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీంద్రచారి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ సహకారంతో రెండు వేల పెళ్లిళ్ల చేశామని తెలిపారు. కార్యక్రమంలో కమ్మదనం సుధాకర్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, సంఘం సభ్యులు దుప్పల్లి రాములు, డిస్కో శ్రీను, కొందూటి రవి, బాలబ్రహ్మాచారి, మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి

అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అర్చన



మాట్లాడుతున్న వీసీ అర్చన

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని, అప్పుడే వారు జీవితంలో రాణిస్తారని అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అర్చన అన్నారు. మంగళవారం వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బీబీఏ విద్యార్థులకు ఓరియేంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోని చదవాలన్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. క్రమం తప్పకుండా క్లాస్‌లకు రావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధ్యాపకులు కూడా విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోని చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, అడ్మిషన్స్ డీన్ మహిపతి శ్రీనివాస్‌రావు, హెచ్‌వోడీ విష్ణుచందన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్

దుకాణాల అద్దె చెల్లింపు గడువు పెంచాలి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 12 : షాద్‌నగర్ బస్టాండ్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దె గడువును పెంచాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రెంటల్ అగ్రిమెంట్ ముగియడంతో వ్యాపారులు ఎమ్మెల్యేకు సమస్యను వివరించారు. కరోనా వల్ల రెండేళ్లు వ్యాపారాలే నడవక నష్టపోయామని, మరో రెండేళ్లు తమ ఒప్పందాన్ని పొడగించాలని కోరారు. వ్యాపారుల కోరిక మేరకు కాస్త అద్దెను పెంచైనా సరే గడువివ్వాలని మంత్రిని కోరగా.. పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆర్టీసీ ఎంపీడీ మంత్రి లెటర్ రాశారని ఎమ్మెల్యే తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

ఇకపై నిరంతర తనిఖీలు : ఏసీపీ శ్రీనివాస్‌రావు

వంద మంది పోలీసులతో పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు



పాన్‌షాప్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 12 : ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకపాలకు పాల్పడితే వారి తాటతీస్తామని, అలాంటి వారెవరినీ సహించం అని శంషాబాద్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. ఏసీపీ అధ్వర్యంలో నలుగురు సీఐలు, 80మంది కానిస్టేబుళ్లు శంషాబాద్‌లో పాన్ షాప్‌లు, లాడ్జీలు, కిరాణ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇటీవల గంజాయి, ఇతర మత్తు పదార్థాల ఆనవాళ్లు లభ్యమైన నేపథ్యంలో ఈ ప్రాంతంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. అలాగే కార్డెన్‌సెర్చ్ నిర్వహించి సర్టిఫికెట్లు లేని ఐదు బైక్‌లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఏసీపీ విలేకరులతో ఏసీపీ మాట్లాడుతూ.. కమిషనర్ అదేశాల మేరకు తనిఖీలే చేశామన్నారు. డ్రగ్స్ మత్తు పదార్థాలు అమ్ముతున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీలు ఇకపై నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు. డ్రగ్స్ అమ్మినా, కొన్నా నేరమేనని అన్నారు. డ్రగ్స్ గురించి ఏ చిన్న విషయం తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో ఓ పాత నేరస్తుడ్ని అరెస్టు చేశామని చెప్పారు. అతడిపై 8కేసులు ఉన్నాయని, అందుకే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో జోన్ సీఐలు బాల్‌రాజు, నరేందర్‌రెడ్డి, ప్రసాద్, ఎస్సైలు, హెచ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.




వికారాబాద్‌లో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

హిందువులపై దాడులను అరికట్టాలి

హిందూ ఐక్య వేదిక ● వికారాబాద్‌లో బంద్ విజయవంతం

వికారాబాద్, ఆగస్టు 12 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వికారాబాద్‌లోని హిందూ ఐక్యవేదిక పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ పట్టణంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. పట్టణంలో వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు రామ మందిరం చేసుకుని బంగ్లాదేశ్‌లో జరిగిన దమనకాండకు అశువులు బాసిన హిందువులకు రెండు నిమిషాలు మౌనం పాటించి, అక్కడ ఉన్నహిందువులకు మనోధైర్యం నింపాలని హనుమాన్ చాలీసా పారాయణం చేసి అనంతరం అక్కడి నుండి కదిలిందిరా కాషాయం... హిందువులపైన అరాచకాలు ఆపాలి, సేవ్ బంగ్లా హిందూస్ అని నినాదాలు చేస్తూ శాంతి యుతంగా కాషాయం జెండాలతో బీజేఆర్ చౌరస్తా వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బంగ్లాదేశ్‌లో అరాచకాలకు పాల్పడిన వారి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు, కులసంఘాల నాయకులు, వ్యాపార, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం సాయంత్రం మేడ్చల్ పట్టణంలో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. వివేకానంద విగ్రహం వద్దకు చేరుకుని కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రభుకర్‌రెడ్డి, జాకట ప్రేమ్‌దాస్, శ్రీనివాస్‌గౌడ్, వంశీవిజయ్, మైసరి రాజు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్





నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి, స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

- చోరీ కేసును చేధించిన పోలీసులు
- 300 సీసీ కెమెరాల పరివేక్షణతో విచారణ

మూడుచింతలపల్లి, ఆగస్టు 12 : ఈనెల 6వ తేదీ రాత్రి తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ కృష్ణ నగల షాపులో జరిగిన చోరీ కేసును పోలీసులు చేధించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని సోమవారం శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ కోటిరెడ్డి విలేకరుల సమావేశం వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రాజస్థాన్‌కు చెందిన శంకర్ సింగ్ (23), శంకర్‌సింగ్ (25), మేడ్చల్ జిల్లా కొంపల్లిలో కారు, ఆటో డ్రైవర్లు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఇద్దరు ఎక్కువగా డబ్బు సంపాదించాలనే ఆశతో పాటు, లగ్జరీ జీవనం గడపాలని, రాజస్థాన్‌కు చెందిన హనుమంత్‌సింగ్, జలాంసింగ్‌ను పిలిపించి చోరీకి పథకం పన్నారు. ఏదైనా నగల షాపులో బంగారాన్ని పెద్దఎత్తున దొంగతనం చేద్దామని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో ఈనెల 4న గజ్వేల్‌లోని మార్కెట్ వద్ద పల్సర్ బైక్‌ను దొంగలించారు తరువాత అల్వాల్‌లోని సూర్య నగర్‌లో ఇల్లును అద్దెకు తీసుకుని ఉన్నారు. 5వ తేదీన పథకం ప్రకారం తూంకుంటకు వచ్చి రెక్కీ నిర్వహించారు. శ్రీ కృష్ణ జ్యూవెల్లరీ షాపులో చోరీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. 6వ తేదీ రాత్రి గడ్డపార సాయంతో షెటర్‌ను తొలగించి, బంగారం, వెండి, నగదు అపహరించుకుని అల్వాల్‌కు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న డీసీపీ కోటిరెడ్డి సంఘటనా స్థలానికి చెరుకుని పరిశీలించారు. శ్రీ కృష్ణ జ్యూవెల్లరీ షాపు యజమాని గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. డీసీపీ కోటిరెడ్డి అధ్వర్యంలో 5 బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు 300 సీసీ కెమరాల పరివేక్షణలో ముమ్మరంగా విచారణ చేపట్టారు. 11వ తేదీ ఆదివారం అల్వాల్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు నిందితులు శంకర్‌సింగ్, జలామ్‌సింగ్‌లను పట్టుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి 11.5 తులాల బంగారు ఆభరణాలు, 46 కిలోల వెండితో పాటు 2 సెల్‌ఫోన్లు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు త్వరలోనే వారిని పట్టుకుంటామని డీసీపీ తెలిపారు. ఈ కేసును చేధించిన ఏసీపీలు రాములు, కలింగరాజు, సీఐ శ్రీనాథ్, డీఐ నర్సింహరాజు, డీఐ రాజెందర్, ఇన్‌స్పెక్టర్లు నర్సింహ, రాజు, గంగాధర్, మునీందర్, వెంకట్, రాజు, సిబ్బందిని డీసీపీలు కోటిరెడ్డి, నర్సింహలు అభినందించారు.

జల్సాలకు అలవాటు పడి..

చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు బానిసలై జల్సాలు, విలాసవంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో కష్టపడకుండా ఈజీ మని సాంపాదించాలని చోరీలకు పాల్పడుతున్నారు. చివరికి పోలీసులకు చిక్కి కటకట్చాల పాలై ఊసలు లెక్కపెడుతున్నారు. వారి బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారు. కాగా, ప్రజలు తమ ఇంటి వద్ద చుట్టు పక్కల సీసీ కెమెరాలను అమర్చుకుని, పోలీసులకు సహకరించాలని డీసీపీ సూచించారు.

అకృత్యాలకు పాల్పడటం హేయం



కీసర రూరల్: నాగారంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కీసర రూరల్, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై అకృత్యాలకు పాల్పడటం హేయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం మున్సిపల్ పరిధి రాంపల్లి చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు, సామాజిక కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు వేణు, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, నాయకులు శ్యామ్‌శర్మ, కిషోర్, సూర్యశేఖర్‌రెడ్డి, జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, జూపల్లి నరేష్, సురేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బషీరాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం బషీరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ చౌక్‌లో వక్తలు పలువురు మట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై విచక్షణా రహితంగా దాడి చేసి ఆలయాలను ధ్వంసం చేస్తుండటంపై మండిపడ్డారు. హిందువులు అందరూ సంఘటితం కావాల్సిన సమయం అసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ హిందూ ధార్మిక ప్రచారక్ రఘోత్తమచారి హాజరై మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, హిందు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నవాబుపేట బంద్

నవాబుపేట: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడిని ఖండిస్తూ మంగళవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ నిర్వహించనున్నట్లు హిందు ఐక్యవేదిక నాయకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యాపారస్తులు బంద్‌కు సహకరించాలని వారు కోరారు.



బషీరాబాద్: బషీరాబాద్‌లో మాట్లాడుతున్న హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు

వైభవంగా బీరప్పస్వామి బోనాలు



మర్రిపల్లిగూడలో బోనాలతో వెళుతున్న మహిళలు

ఘట్‌కేసర్ రూరల్, ఆగష్టు 12: మండలంలోని మర్రిపల్లిగూడ కుర్మసంఘం ఆధ్వర్యంలో సోమవారం బీరప్ప బోనాలు ఘనంగా నిర్వహించారు. కురుమల కులదైవమైన శ్రీశ్రీశ్రీ బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బీరప్పస్వామి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పెద్దకుర్మ మేకల మైసయ్య వీరభోనం చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి బోనాలు సమర్పించారు. ఒగ్గు డోలువాయిద్యాల నడుమ శివసత్తుల విన్యాసాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కుర్మసంఘం నాయకులు, స్వామి వివేకనంద యూత్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

చెట్ల నరికివేత



నరికివేతకు గురైన చెట్లు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12: ప్రభుత్వం చెట్లను సంరక్షించాలని చెబుతున్నా చెట్ల నరికివేత ఆగడంలేదు. కాచవానిసింగారం మేయిన్‌రోడ్డు పక్కనే ఏపుగా పెరిగిన పెద్దచెట్లను విద్యుత్ అధికారులు నరికివేశారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులే చెట్లును నరికివేయడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే పెద్ద చెట్లను ఇష్టానుసారంగా నరికివేశారు. చెట్ల నరికివేతపై పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



డీఆర్‌ఎస్ పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 12: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో గల డీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎస్ ఐఎస్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎస్ ఐఎస్ డైరెక్టర్ అంజనీకుమార్ అగర్వాల్, గార్గ్‌అగర్వాల్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఫ్లైఓవర్‌పై లైట్ల మరమ్మతు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, ఆగస్టు 12: 'చీకట్లు - ఇక్కట్లు' అనే శీర్షికతో ఈ నెల 12న (సోమవారం) ప్రచురితమైన కథనానికి మున్సిపల్ సిబ్బంది యంత్రాంగం స్పందించారు. కొడంగల్ రోడ్డు మార్గంలోని రైల్వే ఫ్లైఓవర్‌పై వెలగని లైట్లకు మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేశారు. బ్రిడ్జిపై ఉన్న హైలాండ్‌ను రిపేర్ చేశారు. దీంతో సోమవారం రాత్రి జిగేల్ మంటూ లైట్లు కనిపించాయి. అయ్యప్పనగర్, పాత తాండూరు ప్రాంతంలోనూ లైట్ల మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంపై ఎంఈవో విచారణ

తాండూరు రూరల్, ఆగస్టు 12: మల్కాపూర్ గ్రామ శివారులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైద్యనాథ్‌పై మండల విద్యాధికారి సోమవారం విచారణ జరిపారు. హెచ్‌ఎం వైద్యనాథ్‌పై మల్కాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి నెల రోజుల క్రితం వికారాబాద్ జిల్లా డీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా డీఈవో ఆదేశాల మేరకు మండల విద్యాధికారి వెంకటయ్యగౌడ్ పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. వైద్యనాథ్ పాఠశాల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ చేపట్టినట్లు ఎంఈవో వెంకటయ్యగౌడ్ తెలిపారు. ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులు పాఠశాలలను తీర్చిదిద్దాలి

పూడూరు, ఆగస్టు 12: ఉపాధ్యాయులు పాఠశాలలను తీర్చిదిద్దాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లి కలాన్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న వాతావరణాన్ని, విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఒక మారుమూల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అన్ని సౌకర్యాలతో విద్యార్థులు కూడా చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను మండలంతోపాటు జిల్లాలో కూడా విస్తరించి, ఆదర్శంగా నిలవాని ఎంపీ పేర్కొన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధి ఏ విధంగా జరిగిందో హెచ్‌ఎం ఖాజామైనుద్దీన్, ఎస్‌ఎంసీ చైర్మన్ రవిలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వెంట గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



వివరాలు నోట్ చేసుకుంటున్న ఎంపీ

ఎంపీకి సన్మానం

కులకచర్ల: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని బీజేపీ నాయకులు సన్మానించారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయనను పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, పరమేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సూర్యకాంత్, వెంకటయ్యగౌడ్, మహిపాల్, అంజిలయ్య, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

పరిగి: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి ఇంటికి వచ్చారు. భాస్కరయోగి ఎంపీని సాదరంగా ఆహ్వానించి స్వాగతం పలికి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీని కలిసినవారిలో నాయకులు అంజిరెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు.

సమగ్ర శిక్షకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ధారూరు, ఆగస్టు 12: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలో సోమవారం మృతిచెందిన ఏడుగురు సమగ్ర శిక్ష ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి సంఘం బాధ్యులు నివాళులర్పించారు. నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగుల కుటుంబాలకు బేసిక్ పే అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వారికి ఆరోగ్య బీమా, జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో స్రవంతి, సిబ్బంది భారతి, సరస్వతి పాల్గొన్నారు.



ధారూరు: మృతులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

పరిగి: సమగ్రా శిక్ష ఉద్యోగులకు భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు చంద్రశేఖర్, మోహన్‌లు డిమాండ్ చేశారు. ఎస్‌ఎస్‌ఏలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల చిత్రపటాలకు పరిగి ఎమ్మార్సీలో సోమవారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జ్యోతి,అనంతవిద్యాసాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూరు అభివృద్ధికి రూ. 3.65 కోట్లు

తాండూరు, ఆగస్టు 12: తాండూరు పట్టణాభివృద్ధి మున్సిపల్ సాధారణ నిధులు 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రూ.3.65కోట్లను కేటాయించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ చెప్పారు. తాండూరులోని 4వ వార్డులో సోమవారం రూ.15లక్షల అంచనాతో చేపట్టనున్న డ్రైనేజీ, రోడ్డు పనులను ప్రారంభించారు. మున్సిపల్ నిధులతో పాటు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తన కోటా నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ శోభారాణి, కౌన్సిలర్లు ఆస్లాం, వెంకన్నగౌడ్, రవి రాజు, హబీబ్ లాల తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్

స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధమవ్వాలి

పెద్దేముల్, ఆగస్టు 12: స్థానిక ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధమవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో సోమవారం పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలతో మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం దక్కించుకున్న తమకు ఇక తిరుగులేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించి వారి మనసులు గెలుచుకుందామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పరి రమేష్, బాలేశ్వర్‌గుప్త, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 12: మండల కేంద్రంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని లారీ యూనియన్ నాయకులు కోరారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ మనోహరచక్రవర్తి, పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ అధ్యక్షుడు ముంతాజ్, నాయకులు సంగమేశ్, రాచయ్యస్వామి, హఫీజ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి: సీఐ

మూడుచింతలపల్లి, ఆగస్టు 12: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్ అన్నారు. శామీర్‌పేట్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ క్యాంపస్‌లో సోమవారం ఆంటీ ర్యాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. కళాశాల క్యాంపస్‌లో ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలుతప్పవని హెచ్చరించారు. ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదు కాబడిన విద్యార్థులు భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగాలకు అర్హులు కాలేరన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే నాన్‌బేయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. తోటి విద్యార్థులతో కలిసికట్టుగా ఉంటూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాలలో ర్యాగింగ్ కమిటీ, కళాశాల యాజమాన్యం దృష్టికి లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐపీఈ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, డీన్ శ్రీకాంత్, ప్రొఫెసర్ జార్‌కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనాథ్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తాండూరు, ఆగస్టు 12: శ్రావణ మాసం రెండవ సోమవారం ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పట్టణంలో సాయిపూర్ ప్రాంత ప్రభుత్వ నెంబర్ 1 ఉన్నత పాఠశాల పక్కనున్న రామ లింగేశ్వరాలయంలో, పట్టణ నడి బొడ్డున ఉన్న భావిగి భద్రేశ్వరాలయంలో, చించోలిరోడ్డు మార్గంలోని చెరువెంటి ఈశ్వరాలయంలో, పాత తాండూరు వెంకటేశ్వరాలయంలోని శివాలయాలకు భక్తులు వెళ్లి పూజలు చేశారు. భద్రేశ్వరాలయంలో భద్రేశ్వరుడికి ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు నైవేద్యాలను సమర్పించారు.

శామీర్‌పేట: శ్రీభవానిరామలింగేశ్వరస్వామి(శివాలయం)లో ఆలయ ప్రధానార్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు.



శామీర్‌పేట్: పూజల్లో పాల్గొన్న భక్తులు

15 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

శామీర్‌పేట గ్రామంలో పునఃనిర్మించిన శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను ఈ నెల 15 నుంచి 17 వరకు భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు స్థానిక కట్టమైసమ్మ ఆలయం కమిటీ చైర్మన్ అశోక్ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 12: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో ప్రజలకు సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరవింద్, ఏఎస్ఐ బలరాం, పోలీసు సిబ్బంది సాయికుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యం

కీసర రూరల్, ఆగస్టు 12: వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. ఈ ఘటనలు నాగారం, పోచారం మున్సిపాలిటీల పరిధిలో చోటుచేసుకున్నాయి. కీసర పోలీస్ స్టేషన్ పరిధి నాగారం మున్సిపాలిటీలో సోమవారం ఓ మహిళ అదృశ్యమైంది. కీసర సీఐ వెంకటయ్య వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ మల్లిఖార్జుననగర్ కాలనీకి చెందిన అంజిలమ్మ(55సంవత్సరాలు) శనివారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో పరిసరాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవటంతో కీసర పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అంజిలమ్మకు మతిస్థిమితం సరిగ్గా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.



అంజిలమ్మ

ఘట్‌కేసర్ రూరల్: వివాహిత అదృశ్యమైన ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన కవాడి రవి భార్య బాలమణి(35సంవత్సరాలు) మున్సిపాలిటీలో పనిచేస్తోంది. అనారోగ్యం కారణంగా మూడునెలలు సెలవు తీసుకొని ఇంట్లోనే ఉంటుంది. ఈనెల 11న ఇంట్లో సెల్‌ఫోన్ పెట్టి బయటకు వెళ్లి రాత్రి వరకూ తిరిగిరాలేదు. దీంతో భర్త తెలిసిన వారిని, బంధువులను, మిత్రులను విచారించిన ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బాలమణి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, ఆగస్టు 12: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లి గ్రామానికి చెందిన జమ్ముల కేశవులు(54) పోతాయిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా బైక్‌పై అతివేగంగా వస్తున్న ఓ వ్యక్తి కేశవులును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కేశవులు తలకు, ఎడమకాలికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కస్టమ్స్ అధికారులమని రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు

- కేసు నమోదైందని బెదిరించి డబ్బులు డిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఆగష్టు 12: కస్టమ్ అధికారుల పేరుతో సైబర్ నేరగాళ్ల రెచ్చిపోయారు. డ్రగ్స్ కేసు నమోదైందని బెదిరించి ఆ కేసు కొట్టేయడానికి సదరు వ్యక్తి వద్ద డబ్బులు లాగారు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో కలకలం రేపింది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారంకు చెందిన నరేష్‌కు ఈనెల 3న కస్టమ్స్ అధికారులమని కాల్ చేశారు. నీకు వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని, దీంతో కేసు నమోదైందని ఫోన్ చేశారు. డబ్బులు పంపిస్తే కేసులేకుండా చేస్తామని చెప్పారు. దీంతో బయపడి నరేష్ రూ.20వేలు పంపించాడు. కేసు సీరియస్‌గా ఉంది ఇంకా డబ్బులు కావాలని మళ్లీ ఫోన్ చేయగా తిరిగి రూ.30వేలు, మరోసారి రూ.34,200, మరోసారి రూ.20వేలతో కలిపి మొత్తం రూ.లక్షా 4వేల 200లు పంపించాడు. తిరిగి రూ.30వేలు కావాలని బెదిరించడంతో మోసపోయానని తెలుసుకున్న నరేష్ పోచారం ఐటీసీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అశ్లీలంగా వీడియో కాల్‌చేసి..

ఘట్‌కేసర్ రూరల్, ఆగష్టు 12: ఫేస్‌బుక్‌లో పరిచయమై అశ్లీలంగా వీడియోకాల్ చేసి ఆ వీడియోను కుటుంబసభ్యులకు పంపుతామని బెదిరించి డబ్బులు లాగిన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీకి చెందిన అవినాష్‌కుమార్ ఈ నెల 8న ఫేస్‌బుక్‌లో రితిక సావంత్ పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. 11న వాట్సాప్‌లో మేసేజ్ పంపి వీడియోకాల్ చేయగా నరేష్ కాల్ లిఫ్ట్ చేశాడు. ఫేస్ మార్ఫింగ్ చేసి నగ్నంగా మాట్లాడింది. కొద్ది సేపటికి నగ్న వీడియోను మీ కుటుంబసభ్యులకు పంపిస్తా, డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడింది. భయపడిన అవినాష్‌కుమార్ రూ.41వేలు పంపించాడు. అంతటితో ఆగకుండా ఇంకా కొన్ని డబ్బులిస్తేనే వీడియో డిలిట్ చేస్తానని బెదిరించింది. దీంతో అవినాష్ కుమార్ మరో రూ.67వేలు పంపించాడు. తిరిగి డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో మోసపోయానని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాముకాటుతో ఎద్దు మృత్యువాత

బంట్వారం(కోట్‌పల్లి), ఆగస్టు 12: పాముకాటుతో ఎద్దుమృత్యువాతపడింది. ఈ ఘటన సోమవారం కోట్‌పల్లి మండలంలోని మోత్కుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.బాధిత రైతు కావలి బాలయ్య తెలిపిన వివరాల ప్రకారం పొలంలో వ్యవసాయం ముగించుకొని ఎద్దులను మేపుతున్న సమయంలో ఎద్దు పాముకాటుకు గురైనట్లు తెలిపారు.గమనించిన రైతు చికిత్స చేయించిన చివరకు మృతి చెందినట్లు తెలిపారు. ఎద్దు విలువ దాదాపు 60వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యుదాఘాతంతో..

పెద్దేముల్, ఆగస్టు 12: విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాతపడిన సంఘటన ఇందూరు గ్రామంలో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం ఆత్కూర్ గ్రామానికి చెందని బ్యాగారి యాదయ్య ఇందూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మొగులప్ప పొలంలో దుక్కి దున్నడానికి పనులకు వచ్చారు. దుక్కి దున్నడం ముగిసిన తర్వాత ఎడ్లను మేత మేపడానికి వదిలిపెట్టాడు. ఒక ఎద్దు మేత మేస్తూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తక్కువగా ఉండడంతో విద్యుత్‌తీగ తగిలి ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి



ఎమ్మెల్యేతో మైల్వార్ నాయకులు, రైతులు

బషీరాబాద్, ఆగస్టు 12: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్యే నివాసంలో సోమవారం మైల్వార్ కాంగ్రెస్ నాయకులు, రైతులు ఆయనను కలిసి గ్రామ సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా సోంపల్లి బిచ్చిరెడ్డి, శ్రీహరి, నగేష్ తదితరులు ఎమ్మెల్యేతో అక్కలమ్మ చెరువు నుంచి కొత్లాపూర్ వరకు వెళ్లే ప్రధాన కాల్వ పూడుకుపోయిందని, మరమ్మతు చేయించాలని కోరారు. అక్కలమ్మ చెరువు ప్రధాన కాల్వ మరమ్మతుకు ఎమ్మెల్యే వెంటనే వికారాబాద్ ఇరిగేషన్ ఈఈతో మాట్లాడగా స్వయంగా వెళ్లి కలిసి సమస్యపై రాత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లక్ష్మణ్, భీమప్ప, శివరాములు పాల్గొన్నారు.

మేడ్చల్ విద్యార్థులకు 36 బంగారు పతకాలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 12: మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సియల్ 369కు చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో 36 బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మేడ్చల్‌కు చెందిన 47 మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో 36 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనపరిచి బంగారు పతకాలను సాధించారు. వీరు సౌత్ ఏషియాలో నిర్వహించే కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు మాస్టర్లు మున్నా కుమార్ అక్షయ, వరుణ్‌లు తెలిపారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కీసర, ఆగస్టు 12: బాబా సాహెబ్ అంబేడ్కర్ ముని మనుమడు భీమ్ రావు యశ్వంత్ అంబేడ్కర్ సోమవారం కీసర చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కీసర గ్రామానికి, అంబేడ్కర్ వంశానికి చెందిన భీమ్‌రావు యశ్వంత్ అంబేడ్కర్ కీసరకు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

భూ సదస్సును జయప్రదం చేయాలి

దోమ/కొడంగల్: రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో ఈ నెల 13న (మంగళవారం) నిర్వహించనున్న జిల్లా భూ సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, రఘురామ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం భూ సదస్సు పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అదేవిధంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా భూసదస్సును విజయవంతం చేయాలన్నారు.

సంక్షిప్తంగా..

- **కీసర రూరల్:** నాగారం, దమ్మాయిగూడ కమిషనర్లు రాజేందర్ కుమార్, నాగమణిలు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాగారం మున్సిపల్ డీఈఈ సుదర్శనం రఘు, దమ్మాయిగూడ మున్సిపల్ మేనేజర్ వెంకటేశం పాల్గొన్నారు.
- **మర్పల్లి:** భూ లావాదేవీల సమయంలో మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మర్పల్లి తహసీల్దార్ మునిరోద్దీన్ సోమవారం తెలిపారు.
- **మేడ్చల్ టౌన్:** 4వ వార్డులో రూ.18లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి సోమవారం ప్రారంభించారు.
- **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిలిపివేసిన శవపరీక్షలు (పోస్టుమార్టం)ను తిరిగి ప్రారంభించాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు సోమవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.
- **కులకచర్ల:** స్థానిక తపాల కార్యాలయం పరిధిలో గల మోత్కుర్‌లో పాలమూర్ తపాల శాఖ మెయిల్స్ పర్యవేక్షకులు జగన్నాథరావు సోమవారం తపాల శాఖ భారత ప్రభుత్వ డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు.
- **మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):** రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఇన్‌చార్జి ఎన్.బాలమల్లేష్ సోమవారం డీఆర్వో హరిప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు.
- **తాండూరు:** పట్టణంలో ఉన్న డాగ్ బంగ్లాను ఆధునీకరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఉపాధ్యక్షురాలు అంతారం లలిత జిల్లా కార్యదర్శి బండారం భద్రేశ్వర్ , పట్టణ కార్యదర్శి కిరణ్ కుమార్‌లు డాగ్ బంగ్లాను సందర్శించి పరిశీలించారు.
- **పరిగి/దోమ:** గడిసింగాపూర్‌లో టీజీఎస్‌ఆర్టీసి లాజిస్టిక్ కౌంటర్‌ను రంగారెడ్డి, నల్గొండ జిల్లా ఆర్టీసీ కార్గో, లాజిస్టిక్ మార్కెటింగ్ ఏటీయం ఇన్‌చార్జి రవీందర్ సోమవారం ప్రారంభించారు. ప్రారంభించారు. అదేవిధంగా దాదాపూర్‌లో సీఎస్‌సీ కేంద్రంలో కార్గో సేవలను ఆయన ప్రారంభించారు.
- **శామీర్‌పేట:** సింగాయిపల్లిలో మేడ్చల్ జిల్లా రూరల్ బీజేపీ కార్యదర్శి హైమారెడ్డి హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా తన ఇంటిపై సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు.
- **బొంరాస్‌పేట్:** రైతులకు ప్రభుత్వ భూమిలో పట్టా పాసుపుస్తకాలు అందించాలని వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతి పత్రం అందజేశారు. న్యాయవాది సంతోష్ ఆధ్వర్యంలో 20 మంది రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.
- **తాండూరు:** నూలీ శుభప్రద్ పటేల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.
- **పూడూరు:** కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యావలంటీర్లను సమకూర్చిన దాత గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఎస్పీ బంటు రాములును సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మోజెస్ పాల్గొన్నారు.